# భారీ వర్షాలు.. మునిగిన పొలాలు


పెడన 14వ వార్డులోని ఓ ఇంటి వంట గదిలోకి చేరిన వర్షం నీరు


పెడన రామలక్ష్మీ వీవర్స్ కాలనీలో ఓ ఇంట్లోకి చేరిన నీటిని బయటకు పోస్తున్న దృశ్యం


పెడన గూడూరు ప్రధాన రహదారిపై విరిగిన భారీ వృక్షం

- రహదారులు జలమయం
- ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- స్తంభించిన జనజీవనం


పెడన మండలం నందిగామలో నీట మునిగిన పంట పొలాలు


బంటుమిల్లి బీసీ కాలనీ నిలిచిన మురుగు నీరు

**పెడన:** మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఎడతెరిపి లేని వర్షంతో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు కురుస్తున్న వర్షాలతో కచ్చాడ్రెయిన్లు, పంట బోదెలు, పంట డ్రెయిన్లు, పంటలు, రోడ్లు అన్నీ కలిసి పోయి తటాకాలను తలపిస్తున్నాయి. పంట పొలాలు సైతం నీట మునిగాయి. పెడన పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు రామలక్ష్మీ వీవర్స్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, నడుపూరు కాలనీలతో పాటు పలు లోతట్టు ప్రాంతాలుగా ఉన్న అంతర్గత రహదారులు, ఇల్లు సైతం ముంపు బారిన పడ్డాయి. ఇండ్లలోకి వర్షం నీటితో పాటు డ్రెయిన్లలో నీరు కూడా చేరాయి. కొందరు ఇళ్లలో చేరిన నీటిని తోడుకుంటుంటే, మరికొందరు ఏమీ చేయలేని దుస్థితిలో ఉన్నారు. 14వ వార్డులోని ఓ ఇంటిలోకి నీరు మోకాలు లోతులో ఉండటంతో ఆ ఇంట్లోని వృద్ధులు బిక్కుబిక్కు మంటున్నారు. రామలక్ష్మీవీవర్స్ కాలనీలోని పలు ఇళ్లలోకి కూడా నీరు చేరడంతో నీటిని బయటికి తోడుకుంటూ కనిపించారు. పెడన నుంచి గూడూరు వెళ్లే ప్రధాన రహదారిలోని భారీ వృక్షం నేలకొరిగింది. మున్సిపల్ అధికారులు ఆ చెట్టును తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టారు. మండలంలోని పెనుమల్లి గ్రామంలోని చిట్టిబొమ్మ వీరవెంకటేశ్వరావు ఇంటిగోడ కూలిపోయింది. తహసీల్దారు ఆదేశాలతో వీఆర్వో గోవిందరావు నివేదికను అధికారులకు పంపించారు. నడుపూరు, లంకలకలువగుంట తదితర గ్రామాల్లో వర్షం నీరు అంతర్గత రోడ్లపై నిలిచింది. కార్యదర్శులు కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికే తీవ్ర జ్వరాలు భారిన పడుతున్న తరుణంలో తక్షణ చర్యలు చేపట్టి నీరు పోయేలా చూడాలని గ్రామస్తులు, పుర ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

**లోతట్టు కాలనీలు జలమయం**

**బంటుమిల్లి:** మండలంలో భారీ వర్షాలకు లోతట్టు కాలనీలు, పంట పొలాలు నీట మునిగాయి. దాదాపు నెల రోజులుగా సాగు నీటి కోసం ఇబ్బందులు పడ్డ రైతులు ఎడతెరిపి లేని వర్షాలకు పంటలు నీటిపాలై కుదేలవుతున్నారు. వెద పొలాలు దాదాపు రెండు నెలలు కావడంతో ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసుకుని ఉన్నారు. సార్వా పంట అత్యధిక భాగం నీట మునిగిందని వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ తెలిపారు. సోమవారం అమావాస్య కారణంగా సముద్రం పోటు ఎక్కువగా ఉండి పెదతుమ్మిడి, పెందుర్రు మీడియం డ్రెయిన్లు ఎగదట్టి నీటి ప్రవాహానికి ఆటకంగా మారింది. దీంతో నాగేశ్వరరావుపేట, బంటుమిల్లి, ఆముదాలపల్లి, కొత్తపల్లి మైనర్ డ్రెయిన్లలలో నీరు బయటకు వెళ్లక సమీపంలోని కాలనీలు, రోడ్లపైన పార్లాయి. పంట పొలాల్లో దాదాపు రెండు నుంచి మూడు అడుగులదాక నీరు నిలిచి ఉందని రైతులు పేర్కొంటున్నారు. బంటుమిల్లిలోని బీసీ, గణేష్ కాలనీల్లో మురుగునీరు చేరింది. ఇప్పటికే గ్రామంలో వైరల్ జ్వరాలు, డెంగీతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగు నీటిలో నడిచి కాళ్లు దురదలు వస్తున్నాయని, విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై తహసీల్దార్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో సమస్యలను గుర్తించేందుకు వీఆర్‌ఓలను ఆదేశించామన్నారు.

**కృత్తివెన్ను:** వరిచేలల్లోకి భారీగా వర్షం నీరు చేరడంతో ఇటీవల నాట్లు పూర్తి చేసిన చేలు నీటమునిగిపోయాయి. గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరడంతో నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. తీర గ్రామాలైన లక్ష్మీపురం, దోమనగొంది, గరిశపూడి, పోడు తదితర గ్రామాలలో సముద్రపు పోటు ఎగదన్నడంతో ఆక్వా చెరువులు సైతం నీట మునిగిపోయాయి. వర్షం కారణంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. మండలంలోని కొమాళ్లపూడి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో సత్యనారాయణ అనే కౌలురైతు 10 రోజుల క్రితం నాలుగు ఎకరాలలో నాట్లు వేయగా వర్షం నీరు చేరి చేనంతా నీటమునిగిపోయింది. దాదాపు రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. యండపల్లి, నీలిపూడి, మునిపెడ గ్రామాలలోనూ ఇటీవల నాట్లు వేసిన చేలు నీటమునిగిపోయాయి. వీటిని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**కొట్టుకుపోయిన వరి మొక్కలు..**

కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లో రెండు మూడు రోజుల క్రితం వేసిన నాట్లు మొక్కలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. వరి దుబ్బులు కనబడకుండా పొలాలు నీట మునిగాయి. మరో రెండు రోజులు వర్షాలు ఉంటే ఈ పొలాల్లో నీరు బయటకు పోయే పరిస్థితి ఉండదు. నాలుగైదు రోజులు నీటిలో నాని ఉంటే నాలుగైదు రోజుల క్రితం వేసిన నాట్ల దుబ్బులు పాచిపోయి చనిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నిన్నటి వరకూ సాగునీందక ఆయిల్ ఇంజిన్లతో నాట్లు వేసిన పొలాలు భారీ వర్షాలకు నీట మునగడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కొంత మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ముంపులో 1500 ఎకరాల్లో నాట్లు**

**భావదేవరపల్లి(నాగాయలంక):** అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో శుక్రవారం నుంచి ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షం కారణంగా మండలంలోని దిగువ గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నాట్లు పడిన వరిపొలాలు నిండుగా నీట మునిగాయి. వివరాలు అందించడంలో వ్యవసాయశాఖ బాధ్యులు అందుబాటులో లేరు, రెవెన్యూ వర్గాలు లైట్‌గా తీసుకోవడంతో సరైన సమాచారం అందలేదు. శనివారం ఉదయానికి వర్షపాతం 78.8 మి.మీ నమోదైనట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ చెప్పారు. భావదేవరపల్లి రెవెన్యూ పరిధిలో సెంట్రల్ ఛానల్ అనుబంధంగా ఉన్న 1,2,3 ఉప కాల్వల కింద, చోడవరం పత్ర, మర్రిపాలెం, పేర్లవానిలంక తదితర పల్లపు పొలాల్లో, అధికంగా వరి పైరు పూర్తిగా నీటిలో మునిగి పోవడంతో ఆ ప్రాంత రైతులు తీవ్రంగా కలవర చెందుతున్నారు. సుమారు 1500 నుంచి 2 వేల ఎకరాలకు పైగా వరి నీటిలో మునిగిందని రైతులు చెప్పారు. అమావాస్య ప్రభావ తీవ్ర పోటుతో డ్రెయిన్‌లలో నీటి పారుదల ప్రభావం తగ్గి ఎగతట్టిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మురుగు పారుదల స్తంభించడం, పంట కాలువల నియంత్రణ లేకపోవడం అంశాలపై ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని రైతులు తెలిపారు. కరకట్ట వెంట ఔట్‌ఫాల్స్ స్లూయిస్‌ల షట్టర్‌లు పనిచేయక పోవడంతో మీడియం డ్రెయిన్‌లలో మురుగు ఎగతడుతుందని పర్యవసానంగా తమ పొలాలు మునిగి పోతున్నాయంటున్నారు.

**గూడూరు:** మండలంలో విరామం లేకుండా వర్షం కురుస్తుండటంతో జనం ఇళ్ల నుంచి బయటకు రాలేదు. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి, పొలం గట్లకు గండ్లు కొట్టి పొలాల్లో నీరు బయటకు పోయేలా రైతులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కాల్వల్లో నీరు పొలాల్లోకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరి పొలాలు మునక

**అవనిగడ్డ:** ఎడతెరిపిలేని కుండపోత వర్షం దివిసీమలో జనజీవన స్తంభించి పోయేలా చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రోజంతా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. అవనిగడ్డలోని మండలినగర్, రాజశేఖరపురం, సింహాద్రి కాలనీతో పాటు పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఐసీడీఎస్ కార్యాలయం, తహసీల్దార్ పాత కార్యాలయ భవనం, ఆర్అండ్‌బీ అతిథి గృహం జలదిగ్బంధంలో ఉన్నాయి. ఈదురు గాలులు, జోరు వర్షం వల్ల పలుచోట్ల విద్యుత్ సరఫరాని నిలిపివేశారు. అశ్వరావుపాలెం, బందలాయిచెరువు, మోదుమూడి, వేకనూరు దిగువ ప్రాంత పొలాలు నీటమునిగాయి. డ్రెయిన్లు, పొలాలు వర్షపు నీటితో ఏకమై చెరువులను తలపిస్తున్నాయి.


అవనిగడ్డలో ఐసీడీఎస్ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు


అశ్వరావుపాలెం వద్ద నీట మునిగిన పొలాలు


నాగాయలంక మండలం కమ్మనమోలులో నీట మునిగిన వరి

## క్లుప్తంగా

### సామాజిక సేవా స్ఫృహ అభినందనీయం



**నాగాయలంక:** మండలంలో ఎస్.ఐగా పని చేస్తూ ఇటీవల కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన ఎం.సుబ్రహ్మణ్యం ఆత్మీయ అభినందన కార్యక్రమానికి అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక సాయిమెస్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి నాగాయలంక నూతన ఎస్ఐ కలిదిండి రాజేష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సామాజిక సేవా స్ఫృహతో విధులు నిర్వర్తించినందునే సుబ్రహ్మణ్యం ప్రజల ఆదరణ పొందారని డీఎస్పీ అభినందించారు. తొలుత స్టేషన్ తరపున డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు యువకుమార్, కె.ఈశ్వరరావు, అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి ఎస్.ఐలు జి.శ్రీనివాసరావు, కె.రాజేష్, సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ తుంగల ప్రసాద్, రైటర్ సనకా రాజా హెడ్‌కానిస్టేబుల్స్ ఎన్.వెంకటేశ్వరరావు, సనకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### చెరువులను తలపిస్తున్న వరి పొలాలు



**కోడూరు:** భారీ వర్షాలకు మండలంలోని జయపురం, కృష్ణాపురం, వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, నరసింహపురం, కోడూరు, లింగారెడ్డిపాలెం, జరుగువానిపాలెం, మందపాకల గ్రామాల్లోని వరిపైరు మొత్తం నీటిలో మునిగిపోయింది. అవుట్‌పాల్ స్లూయిస్ ద్వారా సముద్ర పోటు కూడా పొలాల్లోకి రావడంతో ముంపు మరింత ఎక్కువ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపొలాల పక్కనే ఉన్న మురుగు డ్రెయిన్లు, కాలువలు ఏకం కావడంతో పొలాల్లో నీరు ఎప్పుడు బయటకు వెళ్తాయో అర్థం కాక రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. పలువురు రైతులు డ్రెయినేజీ నీరు పొలాల్లోకి రాకుండా మట్టిబస్తాలతో రక్షణ వేసుకుంటున్నారు.

### 90 శాతం పింఛన్ల పంపిణీ



**మోపిదేవి:** అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మండలంలో మొత్తం 6,229 పింఛన్లకు గాను 5,552 మందికి 90 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 672 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. భారీ వర్షంలోనూ ఎలాంటి ఇబ్బంది పడకుండా పింఛన్లు పంపిణీ చేసిన అధికారులను అభినందించారు.

**ఘంటసాల):** మండలంలో పింఛన్లను సక్రమంగా పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాసచంద్ తెలిపారు. శనివారం ఒక్క రోజులోనే మండలంలో 90.47 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. భారీ వర్షంలో కూడా పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ, పంచాయతీ సిబ్బంది, అధికారులను ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ అభినందించారు.

### నగరంలో 91.22 శాతం పింఛన్ల పంపిణీ

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం నియోజకవర్గంలో శనివారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. నగరపాలక సంస్థ పరిధిలో 18,787 మంది పింఛనుదారులు ఉండగా 17,137 మందికి పింఛన్ల పంపిణీ చేసి 91.22 సాధించారు. మండలంలో 11,984 మంది పింఛనుదారులు ఉండగా 10,697 మందికి పింఛన్లు అందజేసి 89.26 శాతం పూర్తి చేశారు.

### 3న జాబ్‌మేళా

**మచిలీపట్నంటౌన్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాశాఖ, డీఆర్డీఏ- సీడ్‌యాప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన అవనిగడ్డ, కురుమద్దాలిలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కురుమద్దాలిలోని రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటరులో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు బయోడేయా ఫారంతో పాటు ఆధార్ ధ్రువీకరణ పత్రాల నకళ్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 79955 34572 (అవనిగడ్డ), 80743 70846 (కురుమద్దాలి), నంబర్లలో సంప్రదించాలన్నారు.

### తహసీల్దారుగా పూర్ణచంద్రరావు

**పెడన:** స్థానిక తహసీల్దారు అబ్దుల్ రహమాన్ మస్తానా శనివారం విధులు నుంచి రిలీవ్ అయ్యారు. ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో అబ్దుల్ రహమాన్ మస్తానా పెడన తహసీల్దారుగా ఆగస్టు 5న బాధ్యతలను స్వీకరించారు. అమరావతి సీఆర్‌డీఏకు బదిలీ చేయడంతో శనివారం రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం పెడన తహసీల్దారుగా డెప్యూటీ తహసీల్దారు కాగిత పూర్ణచంద్రరావుకు పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

## కంట్రోల్ రూము ఏర్పాటు

**మోపిదేవి:** భారీ వర్షాల వల్ల కృష్ణానది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. కృష్ణానదికి ప్రకాశం బ్యారేజీ నుంచి శనివారం 3,42,466 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలినట్లు తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులను కూడా నది ఒడ్డు గ్రామాలైన కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవివార్పు వద్ద ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు వివరించారు. అవసరమైతే కంట్రోల్ రూము నంబర్ 81420 06123ను సంప్రదించాలని సూచించారు.

## పెరిగిన వరద ఉధృతి


ఎడ్లంక వద్ద కృష్ణానదిలో పడవపై రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

**అవనిగడ్డ:** వరద ఉధృతి పెరగడంతో దివిసీమలోని పలు ప్రాంతాలకు వరద నీరు చేరింది. ఎడ్లంక కాజ్‌వే రహదారి శుక్రవారం కొట్టుకుపోవడంతో గ్రామస్తులు పడవపై రాకపోకలు సాగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాస్ తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు, పడవ నిర్వాహకులను హెచ్చరించారు. పులిగడ్డ వద్ద అక్విడెక్టుని తాకుతూ వరద ప్రవహిస్తోంది. సాధారణంగా ఈ ప్రాంతంలో నదిలో పోటు సమయంలో మాత్రమే నీరుండేది. వరద వల్ల నిండుకుండలా కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుంది. వరద ఉధృతిని చూసేందుకు పులిగడ్డ హైలెవల్ బ్రిడ్జికి సందర్శకులు పోటెత్తారు. బందలాయి చెరువు శ్మశాన వాటిక వరదనీటిలో మునిగిపోయింది.

## అస్తవ్యస్తం..


తెలుగురావుపాలెంలో ఇంటిలోకి వచ్చిన వర్షపునీటిని బయటకు తోడుతున్న దృశ్యం

**ఘంటసాల:** వర్షాలకు మండలంలో జనజీవనం స్తంభించిపోయింది. మండలంలోని ఘంటసాల పెద్దగూడెం, గోటకం కాలనీ, తెలుగురావుపాలెం, గోగినేనిపాలెం, పాపవినాశనం, చిట్టూర్పు తదితర గ్రామాల్లో భారీ వర్షాలకు రోడ్లు మునిగిపోయి ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాల్లోకి వరదనీరు చేరడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యుత్తు సిబ్బంది విద్యుత్తు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందుల్లేండా సరఫరా అందించారు. ఘంటసాల పీహెచ్‌సీ, పెద్దగూడెం, తెలుగురావుపాలెం ఎస్సీ కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తెలుగురావు పాలెంలో భారీ వర్షాలకు నీట మునిగిన ఎస్సీ కాలనీని ఇన్‌చార్జి ఆర్ఐ పి.శ్రీనివాసరావు స్థానిక వీఆర్వోతో కలసి పరిశీలించారు. అక్కడి పరిస్థితులను గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు అధికారులకు వివరించారు.

## పంట పొలాల పరిశీలన

**తాడేపల్లి(ఘంటసాల):** వర్షాలకు నీట మునిగిన పంటల పొలాలను మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ రైతులతో కలసి శనివారం పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు అందించారు. డ్రెయినేజీ అధికారులను సమన్వయం చేసుకుని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది పెన్షన్ల పంపిణీలో ఉన్నందున ఆదివారం నుంచి పొలాలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచలు, సలహాలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకట లక్ష్మి, రైతులు సూరపనేని ప్రసాద్, బొందలపాటి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## కొంపముంచిన అక్రమ వలకట్లు


జరుగువానిపాలెం సమీపంలో రత్నకోడు డ్రెయిన్‌లో ఏర్పాటు చేసిన వలకట్లు

**కోడూరు:** దివిసీమలోని పంటపొలాలకు సంబంధించి మురుగు సముద్రంలోకి వెళ్లేందుకు దోహదపడుతున్న రత్నకోడు (తాలేరు) డ్రెయిన్ వలకట్లతో నిండిపోయింది. కొంతమంది ఏర్పాటు చేసిన అక్రమ వలకట్లు నేడు మూడు మండలాల రైతుల పాలిట శాపంగా మారాయి. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాలకు చెందిన సుమారు 25 వేలఎకరాల్లో మురుగు పోయేందుకు రత్నకోడు డ్రెయిన్ ఉపయోగపడుతుంది. చినగుడుమోటు దగ్గర నుంచి నాగాయలంక మండలం సంగమేశ్వరం వరకు ఈ డ్రెయిన్‌లో కొంతమంది అనుమతులు లేకుండా వలకట్లు ఏర్పాటు చేశారు. సుమారు 25 వలకట్లు ఏర్పాటు చేయడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. దీంతో సుమారు 25 వేల ఎకరాల వరిపంట మునకబారిన పడింది.

**చర్యలు తీసుకుంటాం**



రత్నకోడు డ్రెయిన్‌లో అక్రమ వలకట్లు వేసిన విషయం మా దృష్టికి వచ్చింది. వలకట్ల వల్ల పొలాల్లో మురుగు దిగువకు వెళ్లడం లేదంటూ రైతులు ఫిర్యాదులు చేశారు. చినగుడుమోటు నుంచి సంగమేశ్వరం వరకు ఉన్న అన్ని వలకట్లను తొలగిస్తాం. వరిపొలాలు ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకుంటాం.

–పులిగడ్డ వెంకటేశ్వరరావు, డీఈఈ, డ్రెయినేజీ

## అక్రమ లేఅవుట్లను ప్రోత్సహించడంపై ఆగ్రహం

**మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి**

**పెడన:** పట్టణంలో అక్రమ లే అవుట్లను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని, వాటి వల్ల మున్సిపాలిటీకి ఆదాయం పోతుందని కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం కౌన్సిల్ హాలులో అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్ సమావేశంలో మాజీ కౌన్సిలర్ బళ్ల త్రిమూర్తులు మృతికి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండాలోని పలు తొమ్మిది అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. అజెండాలోని 8వ అంశంపై సుదీర్ఘంగా సభ్యులు చర్చించారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో 43 అనధికార లే అవుట్లు ఉన్నాయని అధికారులు గుర్తించడం సంతోషకర విషయమే అయినా అవి ఏర్పాటు అయ్యే వరకు ఎందుకు వేచి ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ లే అవుట్లుకు సంబంధించి అవి ఎవరివి, ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని కొనుగోలు చేసిన వారు ఇంటి పన్నులు వేయించుకోవడానికి, కుళాయిలు వేయించుకోవడానికి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారని, నన్ను పలువురు సంప్రదించారని ప్రసాద్ అన్నారు. ఈ విషయమై సంబంధిత శాఖ సిబ్బందిని వెళ్లి అడిగితే అనాధికార లే అవుట్లలో స్థలం కాబట్టి పన్నులు వేయడం కుదరదని తెలిపారని, పరిష్కారం ఏమిటి అని అడిగితే అనాధికార లే ఆవుట్‌లో ఎంత స్థలం అయితే ఉందో అంత స్థలానికి సంబంధించి పన్ను చెల్లించడంతో పాటు పది శాతం స్థలం మున్సిపాలిటీకి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అప్పుడే టాక్స్ కట్టించుకోవడానికి వీలు కలుగుతుందని అన్నారని, ఈ సమస్యను తక్షణం పరిష్కరించేలా చూడాలన్నారు. అనాధికార లే ఆవుట్ల బోర్డులు పెట్టాలని కౌన్సిలర్ చంద్రబాబు, సతీష్‌లు సభా దృష్టికి తీసుకువచ్చారు. వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ గోపాలరావు తదితరులు ఉన్నారు.

## తడిచి ముద్దయిన నగరం


లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు

**మచిలీపట్నంటౌన్:** కుండపోత వర్షానికి జిల్లా కేంద్రమైన మచిలీపట్నం తడిచి ముద్దయ్యింది. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం శనివారం వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. శనివారం ఉదయం 8.30 గంటల్లోపు 121.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 52.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నగరంలో 24 గంటల్లో 174.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావటంతో జనజీవనం స్తంభించింది. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమై చెరువులను తలపించాయి. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నగరంలోని పలు ముంపు బారిన పడిన లోతట్టు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**ముంపు బారిన పొలాలు..**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మచిలీపట్నం నియోజకవర్గంలోని పొలాలు ముంపునకు గురయ్యాయి. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరి, వేరుశనగ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అధిక వర్షం కురవటంతో వందలాది ఎకరాల్లోని వరి పొలాలు నీటమునిగాయి. దీంతో పంటలు దెబ్బతిని పెట్టుబడి పెరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

## వర్షంలోనూ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు



**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం నియోజకవర్గంలోని చిన్నాపురం ఫీడర్ పరిధిలో పచ్చావారిలంక పొలాల్లో 33 కేవీ విద్యుత్ సరఫరాకు వినియోగిస్తున్న మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అధిక వర్షంతో పాటు ఈదురుగాలులకు ఈ స్తంభాలు శుక్రవారం అర్ధరాత్రి విరిగిపడటంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ మచిలీపట్నం డీఈఈ ఎం.భాస్కరరావు స్పందించి సిబ్బందితో మరమ్మతు లు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టండి

**పెడన:** సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలపై దృష్టిపెట్టి ఎటువంటి అవాంతరం జరగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. శనివారం మున్సిపల్ సిబ్బంది, సచివాలయాల శానిటరీ కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. నిల్వ నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా చెత్త నిల్వలేకుండా చూడాలన్నారు. టీపీవో వి.ఏ సుబాబు, ఏఈ సీతారామాంజనేయులు, శానిటరీ మేస్త్రీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జల దిగ్బంధంలో సంక్షేమ భవనాలు



**చిలకలపూడి(మచిలీపట్నం):** భారీ వర్షాల కారణంగా కలెక్టరేట్ జలమయమైంది. శుక్రవారం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రాంగణమంతా వర్షపునీటితో నిండిపోయింది. కొన్ని కార్యాలయాల్లో వర్షపునీరు చేరుకోవటంతో సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఆటంకం ఏర్పడింది. సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాలతో పాటు బందరు ఆర్డీవో కార్యాలయాల్లో వర్షపునీరు చేరుకుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఎప్పుడూ ఇదే ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది చెబుతున్నారు. కలెక్టర్ డీకే బాలాజీ శిథిలావస్థలో ఉన్న తమ కార్యాలయాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.